

# ఎన్నిక

కాటూరి రవీంద్ర త్రివిక్రమ్

శ్రావణమాసం.

పేరంటానికి వెళ్ళివచ్చిన యిల్లాలు మాదిరి, ఆదరా బాదరా ఏమిటేమిటో చెప్పనున్నట్లు నెత్తిమీదికొచ్చి, టప టప రాల్చింది - నాన బెట్టిన శనగల్లాంటి చినుకులు! తలెత్తి శ్యామల మేఘాన్ని చూసి నవ్వాను. మరికాసిని చినుకులువచ్చి ముఖాన్ని ముద్దెట్టుకున్నాయి.

"చాల్లేవోయ్ నీ సరసం!" అంటూ టెర్లిన్ చొక్కామీద అయినతడిని రుమాలుతో అద్దాను. చెలి మందహాసం లాంటి చల్లని మందమారుతం, తనువెల్లా స్పృశించి కితకితలు పెట్టింది. ఎంతో హాయనిపించింది.

జేబులోంచి కృష్ణమూర్తిమామయ్య రాసిన కార్డు తీసి ఆ సంజెవెలుగులో మరోమాటు పరిశీలించాను.

"చిరంజీవి రామం —

బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా మంచిదికాదని, మనకన్నా ముందువాళ్ళు అన్నమాట. మరి వాళ్ళు బ్రహ్మచారిణులగురించి ఏమీ చెప్పలేదు. కారణం - 'అష్టవర్షే భవత్‌కన్య' అంటూ వ్యక్తురాలు కాకమునుపే ఆ బాధ్యతల నుండి తప్పుకోవటంవల్లనేమో!

కానీ, రోజులు మారాయి! అరవై ఆరు వెళ్ళి అరవైఏడవ సంవత్సరం శ్రావణంతోబాటు - నీరజకి రెండుదశాబ్దాల వయస్సు దాటి, పైన మరోసంవత్సరం ప్రవేశించింది. ఇక వసుంధర విషయం అంటావా? దానికేమీ తక్కువలేవు! ద్వితీయదశాబ్దాన్ని మరో రెండుసంవత్సరాల్లో పూర్తిచేస్తుంది!!

ఇందాకే అన్నాను. 'రోజులు మారేయి' అని! కొబట్టే, యిన్నాళ్ళూ వాళ్ళిద్దరూ సంఘంచేత వేలెత్తి చూపబడకుండా క్షేమంగానే కాలం వెళ్ళదీస్తున్నారు. ఆమాటకొస్తే, ముప్పై అయిదేళ్ళు నెత్తిమీదికొచ్చినా, చుక్కాని లేని నావలా బ్రతుకుతున్న ఎదురింటి శ్రీనివాసులు కూతురు 'శ్రీదేవి' కన్నా మన అమ్మాయిలు వేయిరెట్లు నయమంటాను. కానీ, అలాగని గుండెమీద చెయ్యి వేసుకుని సుఖనిద్ర తీయలేము కదా? ఎంతలేదన్నా ఆడపిల్లల తండ్రులం. మాకీ కడగండ్లు తప్పవ్!

బాబ్బాబు! నీకు పుణ్యం వుంటుంది. ఇప్పటికైనా నీ ఊర్ధ్వదృష్టి మరల్చి - ముఖ్యంగా యీ ఆడపిల్లల తండ్రుల కోరిక తీర్చి తరింపజేయవోయ్! ఈ ఉత్తరం అందుకోగానే తిరుగుటపాలో నేనెదురుచూసేది జవాబుకాదు! నిన్నే!! తతిమ్మా విషయాలు సావధానంగా మాట్లాడుకుందాం. వెంటనే వచ్చెయ్యి.

నీ మామయ్య."

అక్షరంలో అక్షరం యిరికించి, ఇన్‌లాండ్ లెటర్‌లో రాసినంత మేటరు రాసిని మామయ్య మేథకి నవ్వొచ్చింది; నవ్వాను. ఇంకా నయం, మరికాసిని విశేషాలు అడ్రసుపైనకూడా రాశాడు కాదు!

"నీ మామయ్య" అంటూ చనువుగ, చొరవతో రాసినంతలో నాకు ఉన్న మామయ్యలంతా కలిసి ఒక్క కృష్ణమూర్తి మామయ్యేకాదు. ఇంకా యిద్దరున్నారు. అందర్లోకీ పెద్దవాడు రామరాజుమామయ్య, రెండు - సీతాపతి మామయ్య, మూడవవాడు కృష్ణమూర్తి మామయ్య. ఈ కృష్ణమూర్తి మామయ్యకి పదేళ్ళనిండని బాలికవుంది. "అ ఆ"లు దిద్దుకుంటున్న కొడుకున్నాడు! - నీరజ, వసుంధర, రామరాజు మామయ్య పుత్రికలు. అవివాహితలు. మామయ్యలంతా కలిసే వుంటున్నారు, వ్యవసాయం చూసుకుంటూ.

జీవితంలో ఎందరికో ఎన్నో ఆశలుంటాయి. అవి ఉవ్వెత్తునలేచి విరిగిపడే కడలి తరంగాలుగ మారవచ్చు. లేదా, ఆకాశాన్నంటే మహావృక్షాల నల్లుకుని పైకంటా ఎగబ్రాకే లతాకుంజములే కావచ్చు. ఇది వేదాంతంకాదు - జీవిత నగ్నసత్యం!

"విద్యాతురాణాం నసుఖం, ననిద్రా" - నాపట్ల నిజమై, విద్యాదాహంతో ఎన్ని కష్టాలకైనా ఆత్మస్థైర్యంతో ఎదురొడ్డి నిలిచి, నా గమ్యాన్నందుకోగలిగాను. ఈ సుదీర్ఘ ప్రయాణంలో - నాజీవితం ఇరవై అయిదు వసంతాలను దాటుకుంటూ వచ్చిందనీ, నే నీనాడు క్రొత్తపుంతను తొక్కాలనీ, కృష్ణమూర్తిమామయ్య చెప్పేదాకా తెలియలేదు.

ఆలోచనల్లో సాగిపోతున్న నా భుజం మీద ఎవరిదోచెయ్యి పడటంతో తృళ్ళిపడి చూశాను. రఘుపతి!

"ఏరా బ్రదర్! ఏమిటలా సర్కారు ఎక్స్‌ప్రెస్‌లా వెళ్ళిపోతున్నావ్? మనిషిని చూడకా, లేక చూసినా పల్కరించటం యిష్టంలేకా?"

"అయామ్ సారీ రఘూ! కొత్త తొందరలో ఉన్నాను. అందుకని..."

"ఏమిట్రోయ్ అంత తొందర? స్టేషన్ కేసి పరుగులు తీస్తున్నావ్! ప్లాట్ ఫారమ్‌మీద కలుసుకోమని ఏజవ్వని అయినా ఆహ్వానం యివ్వలేదుగద?"

"ఏం, పార్కులు కరువైనాయా?"

"కాదు బ్రదర్! బెజవాడ పార్కుల సంగతి నీకు తెలియని దేముంది? ఉన్న రెండు మూడు, రోడ్డు కూడలిలో ఉన్నాయి. దేంట్లో కూర్చున్నా సిటీ సుగంధం తప్పదు. తరిమికొట్టే అకాశవాణి టోరు తప్పదు!"

నవ్వేసి – "కొంచెం పనిమీద. మామయ్యగారి ఊరు బయలుదేరాను. అవతల ట్రయిన్ టయిమయింది. శలవిస్తావా మరి?" అన్నాను.

"అదన్నమాట! మరి చెప్పావు కాదేం? శుభమస్తు – శీఘ్రమేవ కళ్యాణప్రాప్తిరస్తు." అంటూ నిష్క్రమించాడు, రఘుపతి. రిలీఫ్‌గ ఒకమాటు గాలిపీల్చి వదిలాను. స్టేషన్‌లోంచి బొంగురుగా ఏదో రైలింజన్ కూత వినిపించింది. ఆదరా బాదరా ముందడుగు వేసి, టిక్కెట్టు తీసుకుని ప్లాట్ ఫారం మీదకి పరుగెత్తాను. అదృష్టవశాత్తూ రైలు బయల్దేరటానికి సిద్ధగా, నా ఆగమనాన్నే నిరీక్షిస్తున్నట్లు నిల్చుంది. కంపార్టుమెంటులోకి ఎక్కి కిటికీప్రక్కనే వున్న సీటు నొకదాన్ని సంపాయించి స్థిమితంగా కూలబడ్డాను.

కదులుతున్న రైలుతోబాటు ఆలోచనలుకూడ కదిలాయి...


కృష్ణమూర్తిమావయ్య ఇద్దరు బిడ్డల తండ్రి! రామరాజు మామయ్య పెద్దకుమార్తె 'నీరజ' రూపం కళ్ళముందు అగుపించింది. వెంటనే స్టేషను కొస్తున్నపుడు నాతో సరసమాడిన 'శ్యామలమేఘం' జ్ఞాపకానికి వచ్చింది. నీరజ నల్లని నలుపు! నీరజని చూసి కొన్ని సంవత్సరా లయింది. ఆమెలో ఎంతో మార్పు వచ్చివుండాలి. కానీ. ఆ నలుపుమాత్రం నిలిచివుండాలి! ఎక్కడికి పోతుందీ?

నల్లగా అమాయకంగా అగుపించే నీరజ ఎప్పుడూ నాకు అలుసే. ఆ పిల్ల కంట నీరుతిరిగేవరకూ ఏడిపించి నవ్వుకోవటం – చిన్నతనాన్న మావయ్యగారింట్లో గడిపినప్పటి సరదా. వసుంధర అక్కకి పూర్తి వ్యతిరేకం! ఒక్క మాటలో చెప్పాలంటే, అందం అంటే వసుంధర. అనాకారితనం అంటే నీరజ. నన్నంటిపెట్టుకుని తిరిగి, నీరజని ఏడ్పించటంలో తోడ్పడిన బాలిక నేడు పద్దెనిమిది సంవత్సరాల జవ్వని అయిందంటే – ఆ భేదం ఎలా వుంటుందో చూసి తెలుసుకోవాలన్న ఆకాంక్ష కలుగుతోంది. చూడబోతున్నాను కద!

"అయ్యో! పడిపోతావురా," అంటూ ఆదుర్దగా పలికిన కోకిలకంఠాన్ని విని, ఉలిక్కిపడి అటు చూశాను. మూడేళ్ళ








పిల్లవాడు నా కెదురుగావున్న సీటుమీద కెక్కి కూర్చుందామన్న ప్రయత్నంలో ఒక కాలు పైకి వేసి, రెండవ కాలుని పైకి తీసుకెళ్ళలేక గాలిలో ఊగిస్తున్నాడు. తల్లి మందలింపుకి బిక్కమొహం వేశాడు. జాలివేసి, సీటుమీద కూర్చోబెట్టాను. తిరిగే కాలు ఆగుతుందా మరి!

పిల్లాడు కేరింతాలు కొడ్తూ, కిటికీ పట్టుకుని వెనక్కి పరిగెడుతున్నట్లున్న చెట్లూ, చేనుల్ని వినోదంగా పరిశీలిస్తున్నాడు. ఇన్నేళ్ళు వచ్చినా, ప్రయాణాల్లో కిటికీప్రక్కనే కూర్చుని పరిగెడుతున్న భ్రమ కలిగించే పరిసరాల్ని చూడాలనే నా సరదాకీ, పళ్ళురాని ఆ పిల్లవాని సరదాకీ భేదం కనిపించలేదు.

ఆ తల్లి నా వంక కృతజ్ఞతగా చూసి మందహాసం చేసింది. అదే ప్రక్రియలో జవాబిచ్చాను. అప్రయత్నంగానే ఆమెను పరిశీలించి చూశాను. నేను చూద్దామనుకున్న నీరజ ఎలా వుంటుందో ఊహించుకోవాల్సిన అగత్యం తప్పింది! ఆమె ముమ్మూర్తులా నీరజమాదిరే వుంది.. చూపులు మరల్చుకుని పిల్లవాడిని పరిశీలించాను. వెన్నదొంగ విగ్రహం కనులముందు మెదిలింది. అచ్చం తల్లి పోలిక!

తండ్రి ఎలా వున్నాడో చూద్దామనిపించి, ఆమె ప్రక్కనే సుదీర్ఘంగా పేపరు చదవటంలో మునిగివున్న భర్త కేసి చూశాను. ఎరుపు కాకపోవచ్చును. కానీ, ఆమె అంత నలుపుకాదు. పిల్ల

వానికి తండ్రిపోలిక వచ్చివుంటే బాగుండేది అనిపించింది. కానీ, రాదు. వస్తే 'కోడలు నలుపైతే కులమంతా నలుపు' అనే నానుడి ఎందుకు వస్తుంది. నీరజని ఒకవేళ వివాహం చేసుకుంటే ఆ పుట్టబోయేవాళ్ళు అపర కృష్ణావతారాలు అయితీరతారు. అంటే నా ఎరుపులో నాలుగోభాగం కూడా వాళ్ళకి రాదు. నవ్వుకున్నాను. 'అలూ లేదు, చూలూ లేదు, కొడుకు పేరు సోమలింగం' అంటే యిదేనేమో.

ఊహల తెరమీద రాయంచలాంటి వసుంధర కనిపించింది. 'వసుంధర కేం, అపరంజి బొమ్మ!' అనుకున్నాను.

ఉరుములు, మెరుపులతో వర్షం ఆరంభమైంది. కిటికీలోంచి ఒక్కుమ్మడిగా వర్షపుచినుకులు దాడి చేశాయి. షట్టర్సు దింపాను. ఆమె పిల్లవాడిని ఎత్తుకెళ్ళింది. ఖాళీ అయిన జాగాలో విశ్రాంతిగా కాళ్ళుజాచి, జారగిలపడ్డాను. ఉండీలేనట్లు వెలుగుతున్నాయి దీపాలు. రైలు ఊయల కుదుపుల్లోకి సోలిపోయాను. మెల్లిగా నిద్రాదేవి ఒడిలోకి వాలిపోయాను.

* * *

ఉన్నట్లుండి మెలకువ వచ్చింది.

కంగారుగా బయటకు చూశాను. రైలు ఏదోస్టేషనులో ఆగింది. జనం గలబాగా లోపలికి వస్తున్నారు. నిద్రాభంగం కావటాన్కి అదే కారణం. గ్లాసుషట్టర్సు పైకెత్తి తల బయట పెట్టాను. నా తలకాయని గుర్తుపట్టి "చినబాబూ" అన్నాడు మావయ్యగారి పెద్దపాలేరు! సందేహం లేదు. బండి గమ్యానికే చేరింది. సమయానికి నిద్ర లేపినందుకు ఆ పల్లెజనానికి మనసులోనే ధన్యవాదా లర్పించి, బయటకు వచ్చాను. సన్నటి తుంపర పడుతోంది. ఇంకా ఉరుములు, మెరుపులు తగ్గలేదు. పెద్దపాలేరు వెంకన్న గొడుగు తెరిచి, "పదండి బాబూ," అంటూ దారితీశాడు స్టేషను బయటికి. టికెట్టు కలెక్టరుకి కావలసింది అప్పజెప్పి వెంకన్న వెంట నడిచాను.

బయట జోడెడ్లబండి నిలిచివుంది. ఒంటిమీద పడుతున్న నీటిబిందువుల్ని చర్మం కదిలించటంద్వారా క్రిందకు జారుస్తున్న ఎద్దులు, కళ్ళుమూసుకుని నెమరు వేసుకుంటున్నాయి. బండిలోపల చక్కగా అమర్చివున్న కొబ్బరిపీచు దిండ్లపైన ఆసీనుడనయ్యాను. వెంకన్న అదిలింపుతో, చిరుగంటల ధ్వని చేస్తూ గతుకుల్లోంచి బండిని లాక్కెళ్ళసాగాయి ఎడ్లు.

బండి అంతదూరంలో వుండగానే "అబ్బాయిగా రొచ్చార్రా వెంకన్నా?" అని ప్రశ్నించిన కృష్ణమూర్తిమామయ్య గొంతు వినిపించింది. "వచ్చారు బాబూ!" అన్నాడు వెంకన్న సమాధానంగా. ఆ మాటతో కాస్త కోలాహలం చెలరేగింది. మావయ్య వేడినీళ్లూ, టవలూ తెమ్మని పాలేళ్ళకి పురమాయించటం స్పష్టంగా వినిపిస్తోంది.

బండి దిగగానే ఆప్యాయంగా గ్రుచ్చి కౌగలించుకున్నాడు కృష్ణమూర్తి మావయ్య. "నీ కోసం ఎదురు చూడని క్షణం లేదు. ప్రతి బండికీ వెంకడ్ని పంపుతూనే వున్నాను, పోనీలే, అదృష్టవశాత్తూ పెద్దవర్షంలేదు. ముందు కాళ్లు కడుక్కో" అన్నాడు మర్యాదలో ముంచెత్తుతూ. అలాగే చేశాను. అంతలో మళ్ళీ, "అమ్మాయ్, వసుంధరా! కాసిని మంచినీళ్ళు పట్రా," అన్నాడు పెద్దగా.

నా కళ్ళు ఆతృతగా అటు చూశాయి. గుమ్మందగ్గర చిరుగాజుల శబ్దం. రక్తం వేగాన్ని పుంజుకుంది. ఎంతో భారంగా ఆరక్షణం దొర్లింది. తెల్లటి చీరలో నల్లని నీరజ!—చల్లబడిపోయాను...

"అది వంటింట్లో ఉంది బాబాయ్. అమ్మ నన్ను పంపింది" అంటూ మరచెంబు అందించింది మావయ్య చేతికి. వచ్చినంతసేపు పట్టలేదు వెళ్ళటానికి. నీరజగురించి నేను చేసిన అంచనా తప్పు కాదు. నీరజ నేననుకున్నట్లే వుంది! నీరజ వెళ్ళినవైపే చూస్తుండిపోయిన నా భుజంమీద ప్రేమగా తట్టి, "ఇదిగో మంచినీళ్ళు. బట్టలు మార్చుకుందువుగాని—లుంగీ ఇవ్వనా? పంచె కావాలా?" పరాచిక మాడాడు మామయ్య.

"ఏదైనా ఫర్వాలేదు," అన్నాను బింకంగా.

నవ్వేశాడు మావయ్య. బట్టలు మార్చుకుని పడక్కుర్చీలో పడుకుని ఖాతాఖానీ ఆరంభించాను మావయ్యతో. అందరిలోకీ కృష్ణమూర్తి మావయ్యే నాకు ఎంతో సన్నిహితంగా, చనువుగా వుంటాడు; స్నేహితునిలా మాట్లాడతాడు.

మావయ్య మాట్లాడుతున్నాడు. నేను "ఊఁ" కొడుతున్నాను.

అంతలోకి పూజ ముగించుకుని వచ్చాడు పెద్దమావయ్య. "ఏరా రామూ! కులాసాగా వుంటున్నావా?" అంటూ పరామర్శించాడు, కాబోయే అల్లుణ్ణి 'ఏరా' అనే అధికారం వున్న మావయ్య!

"బ్రహ్మాండంగా వున్నాను;"—జవాబిచ్చాను. అక్కడితో ఆరంభించిన సంభాషణని భోజనాలకి పిలిచేవరకూ ఆపలేదు రామరాజుమావయ్య. ఆయన వాగ్ధాటి అలాంటిది! మధ్యలో సీతాపతిమావయ్య రావటం, చూపులతో పరామర్శిస్తే ఒక ప్రక్కన కూర్చోవటం జరిగింది.

భోజనాలదగ్గర మర్యాదా, ఆదరణల పేరుతో కుత్తుకవరకూ తినిపించారు అత్తయ్యలు.

"మరికాస్త పాయసం వేయించుకో అల్లుడా!" అంటూ యిరకాటంలోకి పెట్టబోతున్న చిన్నత్తయ్యకి, "నేను మామూలు మనిషిని!" అన్న విషయం జ్ఞప్తికి లేకుండావుంటే నా పరిస్థితి అధ్వాన్నంగా తయారయివుండేది!

ఆ మర్నాడు ఆకాశం కాస్త తెరిపి యిచ్చింది. పొలాలమీదకి మావయ్యతో బాటు షికారు బయల్దేరాను. దారిలో మావయ్య అన్నమాట లివి...

"రామం! ఇపుడు నీ జీవితాని కొక గమ్యం దొరికింది. ఇంజనీరు వయ్యావు. 'శార్యాంతే విసర్జయేత్' మన స్తత్వం కలిగిన వ్యక్తులనడుమ మసిలే ప్రతివానికీ అనవరతమూ తా మేదో పోగొట్టుకున్నా మనే బాధ వుంటుంది. అది మనశ్శాంతి మినహా వే రేమీకాదు. విందు విస్తరిలా జీవితం వున్నవాడి కేచింతా వుండదు. అలావుంటే వాడికి బ్రతకటం చాతకాదు అనుకోవాలి.

నీ కన్నీ వున్నాయి, ఒక్కటిమినహా. అదే తోడు! నీరజని నీకిద్దామని అన్నయ్య ఒదినల ఊహ. వసుంధర అయితే బాగుంటుందని నా ఉద్దేశ్యం. మరి నీ అభిప్రాయం ఏమిటి?"

నా కింతకూ అర్థమయింది ఒక్కటే. నాకు తోడు ఎంతో అవుసరం. ఆ తోడు వసుంధరలాంటి చక్కనిచుక్క అయితే మంచిదని మావయ్య అంటాడు. నా మనసులో అనుకునేదికూడా అదేగా! కానీ, పెద్దమామయ్య, అత్తయ్యల ఊహల్ని కొట్టిపారేసేముందు కాస్త ఆలోచించటం ఎంతైనా అవుసరం. ఆ మాటే అన్నాను, మావయ్య ప్రశ్నకి జవాబుగ.

ఆ రాత్రి తీరిగ్గా డాబామీద కూర్చుని నాతో నేను మాట్లాడుకోసాగాను.

నీరజకి నా మీద ఎనలేని ఆపేక్ష వున్న మాట నేను కాదనలేని విషయం. వసుంధరమీదకూడా నా కంతే ఆపేక్ష వున్నది మరి! జీవితం పంచుకోవటానికి వచ్చే వ్యక్తి, జీవితాంతం తోడై నిలిచే వ్యక్తి, పరస్పరం అర్థంచేసుకోగలదిగవుండాలి. అంతేకాదు. ఆనందజ్యోత్స్నలు విర జిమ్మేదిగ వుండాలి.

నిజం చెప్పాలంటే, మరొక కఠోర సత్యం వున్నది. "భార్యా కురూపీ శత్రుః" అనేది నా నిఘంటువులో వుంది! ఫలానా రామారావు భార్య కురూపి అని ఒకరు ఏడూరంగానో, జుగుప్సగానో అనుకోవడం నాకు నచ్చదు.

ఆదర్శాలు వల్లిస్తూ అనాకారిని చేసు కుని ఆజన్మాంతమూ అవస్థపడటం నా వల్లకాదు. మరి పెద్దమావయ్య ఆశలు? అయినా నేను జీవించేది నా ఆశలూ, ఆశ యాలూ నిజంలో చూసుకుందామనా, లేక మరొకరి ఆశలకు ప్రతిరూపంగా నిలచి నరకం అనుభవించుదామనా? — తప్ప కుండా యిందులో స్వార్థానిదే పైచేయి!

అసలు వసుంధరకి నామీదున్న ఉద్దే శ్యాలు ఏమిటో తెలుసుకోవటం ప్రధానం.


ఏదీ! వసుంధర యింతమటుకు కంటికి కనుపిస్తేనా?

నాకు ఆట్టేరోజులు శలవు లేదు. మావయ్యగారింట్లో మరో రెండు రోజులు మించి వుండను. ఈలోగా వసుంధరతో ఏకాంతంగా మాట్లాడాలి.

* * *








"వసూ!"

"వస్తున్నా బావా!" చేతిలో కాఫీ కప్పుతో ప్రవేశించింది. ఆమెలోది మొగ్గ విచ్చి వికసించిన గులాబీలావణ్యం. నన్ను నేను మర్చిపోయాను. వసుంధర ఎంత అందంగా తయారయింది!

"రాణిగారికి యింతవరకూ తీరిక చిక్కలేదా?" నిష్ఠురం వేస్తూ అన్నాను.

"అంతే అనుకోవాలి!" సాధార ణంగా జవా బిచ్చింది. ఆ గొంతులో అది వరకటి చిలిపితనం, అల్లరీ లేవు. ఏమి టీ పెద్దరికం. చిన్నతనంలోమాదిరి చను వుగా నా దగ్గరికి రాదేం? అటు, యిటు చూశాను. అది పెద్దమావయ్య గది. మావయ్యలంతా పొలం వెళ్ళారు. అత్తయ్యలు తమపనుల్లో తా మున్నారు. అంతకన్న ఏకాంతం లభించదు.

"వసూ! నీతో కాస్తమాట్లాడాలి. ఇలా కూర్చో."

"లేదు, బావా! వెంటనే వెళ్ళి పోవాలి, పని వుంది."

"ఎక్కడికి పోతావ్!" అంటూ చేతిని దొరకపుచ్చుకుని గుంజాను. కాఫీకప్పు క్రిందపడి పగిలింది. ఇద్దరిబట్టలమీదా కాఫీ చిందింది. ఇది కేవలం తొందరపాటు; కావాలని చేసిందికాదు. కానీ, వసుంధర మొహం ఎఱ్ఱబారింది. "ఏమిటి బావా నీ మోటుసరసం..." తీవ్రంగా అంది. వసుంధరకి కోపగించుకోవటంకూడా వచ్చు!

"నా బట్టలమీదకూడా పడిందిగా!" అమాయకంగా మొహంపెట్టి అన్నాను. వసుంధర నవ్వింది.

"నీ కోతమాషా చెప్పనా?" అన్నాను చిలిపిగ చూస్తూ.

"ఏమిటదీ?" ఆసక్తిగ ప్రశ్నించింది.

"రహస్యం! చెవిలో చెప్పాలి! దగ్గరగా రా!"

"ఇక్కడెవరూ లేరుగా. చెప్పు ఫర్వాలేదు."

"కానీ, గోడకి చెవులుంటాయి!" మరోమాటు నవ్వింది.

"ఊఁ...చెప్పు," చెవిని నాదగ్గరగా తెచ్చింది. చుబుకం నావైపు తిప్పుకుని తటాలున అధరాలమీద తీయని ముద్ర వేశాను. కళ్ళముందు మెరుపు మెరిసినట్లయింది. చేతుల్లోంచి పాములా జారి వెళ్ళిపోయింది వసుంధర. ఎఱ్ఱగా కందిన చెక్కిలిని బాధగా తడుముకున్నాను. జివ్వు మంటోంది!

వసుంధర! చిలిపిగా ప్రవర్తించే వసుంధర! బావంటే ఒకనాడు ఎనలేని ఆపేక్ష చూపించిన వసుంధర! ఆ బావ చేసిన చిన్న ఆకతాయి పనికి యింత అసహ్యంగా ప్రవర్తిస్తుందా?! నా మనస్సులో వర్ణింప నలవికాని కల్లోలం బయలుదేరింది. వసుంధరమీద చెప్పరాని కోపం వచ్చింది. ఎంత సాహసం? ఎంత గర్వం? ఎంత అహంభావం?_ నా మనస్సు అవమానంతో దహించుకుపోయింది.

అంతలో కాఫీకప్పుతో నీరజ ఆగమనం. ఏమీ జరగనట్లు సర్దుకూర్చున్నాను. నన్ను నేను కప్పిపుచ్చుకోవటానికి కృత్రిమంగా ఆప్యాయత కురిపిస్తూ కాఫీకప్పు నందుకున్నాను. అప్రయత్నంగానో సప్రయత్నంగానో ఆమె వేళ్ళకొనలు తగిలాయి. ఒకలాంటి రియాక్షన్ ఆమెలో కనిపించింది. కాఫీ సిప్ చేస్తూ ఆమెని గమనించసాగాను. ఎదురుగావున్న కుర్చీమీద చేతులువేసి, బొటనవేలితో నేలమీద రాస్తూ మాట్లాడింది.

"బావా! రేపే వెళ్ళకపోతే మరో రెండురోజు లుండకూడదూ?"

"ఎందుకు?" ఉక్రోషంగా ప్రశ్నించాను. అదుపులో వుంచిన ఆగ్రహం వెలికురికింది. కొన్ని క్షణాలు మౌనంగా వుండి, తిరిగి అన్నది చిన్న గొంతుతో.

"బావా! చెల్లాయి తొందరలో ఏమో చేసింది. అందుకు నేను గట్టిగా మందలించాను. మనస్సు కష్టపెట్టుకోకు బావా. దాని తరుపున నేను క్షమాపణ కోరుకుంటున్నాను."

నా తల తీసేసినట్లనిపించింది. కాఫీ కప్పు క్రిందపెట్టి_

"నీరజా! దయచేసి నన్ను తక్షణం వదిలి వెళ్ళిపో!" అన్నాను నుదిటిని చేత్తో పట్టుకుని. వసుంధర కొట్టిన చెంప దెబ్బకి కొన్నిరెట్లు బాధ నీరజ మాటల ద్వారా కలిగింది. 'అత్త కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు' లావుంది. అయితే, జరిగినదంతా నీరజ





చూపించనన్నమాట! అమాయకురాలు. తానేదో క్షమాపణ చెప్పుకుని నన్ను సముదాయిద్దా మనుకుంది. నీరజమీద జాలివేసింది.

ఆ రాత్రంతా జాగారం చేసి, నా మనసులో నిలిచి బాధపెడుతున్న ప్రశ్నలకు జవాబుల నన్వేషించసాగాను. కృష్ణమూర్తి మావయ్యకి రేపే జవాబు చెప్పాల్సివుంది. నీరజా? వసుంధరా? ఎవరు?_ ఎవరు నా జీవిత భాగస్వామిని కావాలి?

రూపం లేకపోయినా అణుకువ, ప్రేమ వున్న వ్యక్తి నీరజ. మంచి_చెడులకు భేదం తెలియని వ్యక్తి వసుంధర. నిజమే. వసుంధరలో రాయంచలాంటి ఠీవి వుంది. దిగ్భ్రాంతి కలిగించే అందం వుంది. ఇవి రెండూ కలిసి ఆమె స్త్రీత్వం పరిపూర్ణమైందా? నేను కోరుకునే స్త్రీత్వం నీరజలో వున్నట్లు అనిపించింది. అంతరంగంలోంచి ఎవరో 'వసుంధర గర్విష్ఠి. నీకు తగదు' అని అరిచినట్లనిపించింది. నాకు నిజమే ననిపించింది. నా సమస్యకొక పరిష్కారం లభించినట్లయింది. నీరజలో మంచితనం కనిపించింది. కట్టెదుట చెల్లెలితో సరసమాడినా అపార్థం చేసుకోని వ్యక్తి ఆమె! ప్రశాంతంగా దొర్లిపోయే నదికున్నంత గంభీరత్వం నీరజలో గోచరించింది. ఆమెలో నేను కోరుకున్న రూపం తప్ప అన్నీ వున్నాయి. అందాన్ని కొరుక్కుతింటామా?

నీరజ వసుంధరల నడుమ తారతమ్యం స్పష్టంగా కనిపించింది. ఒకరు నేరేడుపండయితే మరొకరు మేడిపండు. ఆంతర్య ముండీ అందం లేనిది ఒకరు. అంద ముండీ ఆంతర్యం లేనిది వేరొకరు. నా మనస్సు మొదటివిషయంమీదనే మొగ్గింది. మరోప్రక్క మానసిక గ్లానితో అలిసిపోయిన నాకు నిద్ర ముంచుకువస్తోంది. మెల్లగా కలత నిద్ర పట్టింది.

* * *

ఎక్కడో మెల్లగా సన్నాయి విన్పిస్తోంది. దానికి జోడీగా మద్దెలధ్వని. ఇదేమిటి? నే నెక్కడున్నాను? పెళ్ళి పందిట్లోనా! ఈ పసుపుబట్ట లేమిటి? మధుపర్కాలా! ఇది మాంగల్యం. అవును. దీనితోనే నీరజను నా జీవితంతో ముడివెయ్యాలి.

"మాంగల్యం తంతునానేన మమ జీవన..." ఇదేమిటి? అపుడే మాంగల్య ధారణం చేయించమంటున్నాడు పురోహితుడు? ఇతనికి మతిలేదా? లేదు కాబోలు! లేకపోతే గ్రామఫోను పెళ్ళి మాదిరి రెండునిముషాల పెళ్ళేమిటి?

"లేవండి...త్వరగా; మాంగల్యం కట్టండి బాబూ!" ఎవరో హెచ్చరించారు. ఎక్కణ్ణించో తుసుక్కున తుమ్ము! 'ఏడు మేళాలూ, గట్టిగా

వాయించండోయ్' అంటూ అరిచాడెవరో బట్టతలాయన. నేను మెల్లగా లేచి, నీరజ మెడలో మాంగల్యం కట్టబోతున్నాను.

"ఆగండి. ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు!''— ఆశ్చర్యంగా ఆ వ్యక్తికేసి చూశాను. వాడు...రఘుపతికదూ?! వీడిక్కడి కెలా వచ్చాడు? ఎలా ఏమిటి? నేనే శుభలేఖ యిచ్చి రమ్మని గట్టిబలవంతం చేసివుంటాను. అయినా, వీడిష్టమేమిటి. బోడిష్టం. నా యిష్టం! నేను నీరజని చేసుకుంటాను. ఏం చేసుకోకూడదా? అవునయ్యా...నీరజ నలుపే. కావచ్చుగాక! వెండిపళ్ళెంలో అన్నం తింటే వెండితిన్నట్లవుతుందా?— ఏవిఁటో పిచ్చిగానీ!

"ఒరేయ్ రామం! మర్చిపోయావా? ఆనాడు రైల్లో దంపతుల్ని? కోడలు నలుపయితే కులమంతా నలుపవుతుంధంటారు. రేపు నీకు జన్మించే సంతానము నేరెడుపళ్ళలా నీముందు తిరిగితే బాగుంటుందా?"— రైల్లో నేను చూసిన దంపతులగురించి వీడి కెలాతెలుసు? నేనే చెప్పివుంటాను బహుశ! నా శ్రేయస్సు గురించి అంత శ్రద్ధ తీసుకునే రఘుపతి మాటలు నాకు బావున్నాయి.

"బాగుండదే! ఎలా మరి?" వాడినే ప్రశ్నించాను. ఇదేమిటి! అరక్షణంలో యింత మార్పు? కావాలని నీరజని చేసుకునేది నేనేకద! నా నాలిక అదుపుతప్పి మాట్లాడుతుం దేమిటి?

రఘుపతి అన్నాడు. ''నీవు వసుంధరని చేసుకో!''

నాకు వళ్ళు మండింది. "వద్దు—ఆ గర్విష్ఠి నాకు వద్దు. వసుంధర గర్విష్ఠి. నాకు వద్దు!" చిన్నపిల్లాడిలా మొరాయించాను.

హఠాత్తుగా ఏమయిందో తెలియదు.

నా పాదాలమీద ఎవరిదో స్పర్శ. కళ్ళు విడివడ్డాయి. గదిలో గుడ్డిదీపం. అదిరిపడి లేచి చూశాను. ఇంతవరకూ స్వప్నంలో వున్నానా? ఇదేమిటి? వెక్కి-వెక్కి ఏడుస్తూ, కన్నీటితో నా పాదాలు తడిపే దెవరు?— వసుంధరా!!! నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. నా ఆశ్చర్యాని కవధుల్లేవు. పాదాలు వెనక్కి తీసుకుని "వసుంధరా!" అన్నాను ఆశ్చర్యంగా.

"నన్ను క్షమించు బావా! మూర్ఖురాలినై నీమీద చెయ్యిచేసుకున్నాను," అంది ఏడుస్తూ. ఇది మరో కల కాదు కదా!!

''బావా! అసలువిషయం నీకు తెలియదు. నీరజఅక్కయ్య కురూపి అని తెలిసీ ఎంతో హృదయవిశాలత్వంతో ఆమెని స్వీకరించనున్నావని అమ్మనాన్నల మాటలద్వారా విని ఎంతో ఆనందించాను బావా! నీ మంచితనం నా అందంతో మాసిపోరాదన్న తపనతో నీ కంటి కెదురు రాకుండా తప్పించుకు తిరిగాను. కానీ, ఒక్కమాటు నిన్ను





చూడాలన్న ఆశని చంపుకోవటం నావల్లకాలేదు. అందుకే కాఫీ నెపంతో నీతో సరదాగా మాట్లాడవచ్చాను. నేను నీ దగ్గరికి వస్తున్నప్పుడు పక్కచావిట్లో ఏదో పనిచేస్తూ అక్కయ్య కనిపించింది. మన మాటలు ఆమెకి బాగా వినిపిస్తాయి. చిన్ననాటి చిలిపితనంతో నిన్ను పలకరించాలన్న నా ఊహకి అడ్డుకట్టలు వేసుకుని, అక్కయ్య ఎలాంటి అపార్థమూ చేసుకోరాదన్న ఉద్దేశ్యంతో గంభీరముద్ర దాల్చివచ్చాను. కానీ, నీ అల్లరిని పోనిచ్చావుకాదు. ఫలితంగా నా తొందరపాటు. అంతా అక్కయ్య గమనించింది. ఎంతో భయపడ్డాను. కానీ అక్కయ్య దేవత బావా! ఆమె అందమంతా హృదయంలో వుండిపోయింది. అది అందరికీ అగుపించదు. నన్ను నా ప్రవర్తనకి గట్టిగా మందలించింది. నిన్ను క్షమాపణ కోరుకోమంది..."

నీరజ! అవును నీరజ ఎంత

జ్యోత్స్నత్యం కలది! నా కన్నులు చెమర్చాయి జాలితో.

"కానీ, వసూ! నిన్ను నేను వదులుకోలేను. నీరజని ఒకవేళ వివాహం చేసుకుంటే ఆమె కేమన్యాయం చేస్తానో అనే భయం కలుగుతోంది. భూదేవిలా ఆమె అన్నింటినీ సహించగలిగినా, మాయిద్దరి సంసారం బాగా గడవకపోవచ్చు."

"వద్దు బావా! వద్దు... అక్కయ్యకి అన్యాయం చెయ్యకు. ఆమె స్థానాన్ని నేను దొంగిలించుకుని సుఖపడలేను;" బాధపడిపోతూ అంది.

"పిచ్చిదానా! అక్కయ్యమీది అభిమానమేతప్ప ఆమె భవిష్యత్తు నెందుకు ఆలోచించవు? ఆమెకు న్యాయం జరగాలంటే మా పెళ్ళి జరగకూడదు," అన్నాను. వసుంధర కేం తెలుసు - నా భావాలూ, వాటి స్థిరత్వం!!

"బావా!" అంది అయోమయంగా చూస్తూ.

"వెళ్ళు. పెళ్ళి చేసుకో. అన్నీ సవ్యంగా జరుగుతాయి," అన్నాను. వెనకచూపులు చూస్తూ నిష్క్రమించింది.

* * *

"ఎవర్ని ఎన్నుకున్నావురా? వసుంధరనా, నీరజనా?" సాగనంపటానికి స్టేషనువరకూ వచ్చిన మావయ్య ప్రశ్నించాడు.

"వసుంధరనే!" అన్నాను మందహాసం చేస్తూ. మావయ్య మొహంలో ఎంతో సంతృప్తి కనిపించింది. సంతోషంగా భుజంమీద తడుతూ "గుడ్! త్వరలో నీరజ పెళ్ళి, కొద్దిరోజులతేడాతో వసుంధర పాణిగ్రహణోత్సవం..." అన్నాడు.

పొగలుగక్కుతూ వచ్చిన రైలు మా యిద్దరి గమ్యాలను వేరు చేసింది. కదులుతున్న రైల్లోంచి "వీడ్కోలు" చెప్పాను. కదిలిపోతున్న కలలా ఆ స్టేషనూ, టాటా! చెబుతూ నిల్చున్న మావయ్యా, దృష్టిపథంనుండి తొలిగిపోయారు...

నాకెంతో ఆనందంగా వుం దిపుడు. రాయంచలాంటి వసుంధర నాసొంతం కాబోతున్నది. నీరజమీద చెప్పలేని సానుభూతి కలుగుతోంది. ప్చ్! ఏం చేద్దాం? ఎవరి అదృష్టం వారిది... భవిష్యత్తుని తల్చుకుంటూ తన్మయంగా కళ్ళు మూసుకున్నాను.


* * *

"ఒరేయ్ కిట్టాయ్, ఓ కిట్టిగా!" - ఉలిక్కిపడి చూశాడు, ఎవరీ కిట్టాయ్ అని. "నల్లనివాడు పద్మ నయనంబులవాడు..." పద్యం చప్పున జ్ఞాపకానికొచ్చింది. పదేళ్ళ నిండని పిల్లవాడు తుమ్మమొద్దులా, ఎదురుగా కన్పించాడు.

"ఏంటి నాన్నరూ!" అన్నాడు.

యువ






యిందాక గొంతుచించుకుని అరిచిన పెద్దమనిషి నుద్దేశించి.

"విన్నక్కడ కూర్చోవద్దని చెప్పేనా? కంట్లో నలకలు పడితే యింకేమన్నా వుందా? ఏడుపుమొహం పెట్టి నానా రభసా చేస్తావు. ఇటు తగలడు..." అబ్బ! ఎంత కఠోరంగా మాట్లాడుతున్నాడని బాధపడ్డాను. పాపం! నా మాదిరే కిటికీపక్కన కూర్చోవాలని సరదా పడివుంటాడు. అంతమాత్రానికే శాపానార్థాలా?!

"వాడి నెందుకలా ఊరికే కసురుకుంటారు. మీ కేం, ముంగిలా ఓమూల కూర్చుంటారు. చిన్నపిల్లాన్ని కాస్త సరదాగా వుండనివ్వరేం?" ఈ మాటలు నే నన్నవీకాదు, నా మనస్సులో అనుకున్నవీకాదు. ఆమె, స్వయాన అతని అర్ధాంగి మూతి మూడువంకర్లు తిప్పుతూ అన్నది! కిక్కురుమనలేదా మానవుడు. బాబోయ్! ఇది సంసారం కాబోలు!!

ఆమెని చూసి ఉలిక్కిపడ్డాను. ఆమె భర్తని చూసి తెల్లబోయాను. ఆ పిల్లాడిని చూసి మూర్ఛవచ్చినంత పనయింది. ఆలుమగ లిద్దరూ పచ్చని పసిమి. అయితేనేం పిల్లవాడు మాలకాకి! మరి, నా ఎన్నిక?! నా అంతరంగం నన్ను పరిహసించింది...